క్లుప్తంగా

నియామకం


విజేందర్

మొగుళ్లపల్లి: ఇస్సిపేట గ్రామ యునైటెడ్ ఫోరం ఫర్ సమాచార హక్కు చట్టం ఇస్సిపేట గ్రామ కన్వీనర్‌గా యార వి జేందర్‌ను నియమించినట్లు సమాచారం చట్టం మండల అధ్యక్షుడు కమలాపురం విజేందర్ ఆదివారం తెలిపారు. గ్రామస్థాయిలో అవినీతి అక్రమాలు తావు లేకుండా అవినీతి పాలనకు అడ్డుకట్ట వేసేందుకు సమాచార హక్కు చట్టం ఆయుధంగా పనిచేస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన మండల శాఖ అధ్యక్షుడు విజేందర్‌కు జిల్లా కమిటీకి విజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లల రక్షణపై శ్రద్ధ వహించాలి

మొగుళ్లపల్లి: వేసవి సెలవులు రావడంతో పిల్లల రక్షణపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఎస్సై బొనగాల అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లలు గ్రామాల్లోని బావులు, వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లో మధ్యాహ్నం వేళ ఈత కోసం వెళ్తుంటారని అన్నారు. ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు ఏమాత్రం పిల్లలపై అలసత్వం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

మహాముత్తారం: సీఎం రేవంత్‌రెడ్డి ధర్మపురి జనజాతర సభలో నేతకానీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించడం హర్షించదగిన విషయమని నేతకానీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజబాపు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. తెలంగాణ రాష్ట్ర నేతకాని సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. నేతకానీ సమాజానికి హైదరాబాద్‌లో నేతకాని భవనం ఏర్పాటు చేసి నేతకాని సమాజానికి ఆత్మ గౌరవం దక్కేలా చూడాలని కోరారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కారల్‌మార్క్స్ జయంతి

భూపాలపల్లి అర్బన్: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్ జయంతిని జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు హాజరై మాట్లాడారు. మానవ మనుగడకు పరిష్కారమే మార్క్స్ సిద్ధాంతమన్నారు. పెట్టుబడిదారునికి అత్యధిక లాభాలకు కారణమైన శ్రామికులచే ఉత్పత్తి చేయబడిన అదనపు విలువను ప్రప్రథమంగా మార్క్స్ పేర్కొన్నాడని తెలిపారు. శ్రమ దోపిడీలను విశ్లేషించి నిరూపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, విజయలక్ష్మి, మహేందర్, రజిని, రోజా, ఉషారాణి, భిక్షపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన రైతు బాస బుల్లయ్య పిడుగుపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో నాయకులు రఘు, అశోక్, ఎల్లయ్య, దేవేందర్ ఉన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు

భూపాలపల్లి: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం భూపాలపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుర్ర రాజు, ముత్తు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, జెడ్పీటీసీ జోరుక సదయ్య పాల్గొన్నారు.

రేగొండ: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జన్మదినం సందర్భంగా కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మండల అధ్యక్షుడు రాజేందర్, టౌన్ అధ్యక్షుడు భిక్షపతి, జెడ్పీ కో ఆప్షన్ రహీమ్, మాజీ సర్పంచ్ భిక్యానాయక్ పాల్గొన్నారు.

భానుడి భగభగతో జనం బెంబేలు

- మండుతున్న ఎండలు
- విలవిల్లాడుతున్న ప్రజలు
- 42 డిగ్రీలకు పైగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా మారిన రోడ్లు


నిర్మానుష్యంగా మారిన రోడ్లు

వెంకటాపురం(కె) : భానుడి భగభగలతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. మార్చి మొదటి వారం నుంచి మండలంలో ఎండలు మండిపోతున్నాయి. గత 15 రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం మండలంలో ఉష్ణోగ్రత 42 డిగ్రీలు దాటి ఉండటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 10 గంటలలోపు సాయంత్రం 4 గంటల తర్వత మాత్రమే రోడ్లపైకి వస్తున్నారు. మే నెల మొదటి వారంలోనే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని జనాలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం జనంతో ఉన్న రహదారులు ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో మధ్యాహ్నం ప్రజలు ఇళ్లకు చేరుకోవటానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు, వాహనదారులు చెట్ల నీడన సేదతీరుతున్నారు.

శీతలపానీయాలు సేవిస్తున్న ప్రజలు

పెరిగిపోతున్న ఎండల తీవ్రతను తట్టుకునేందుకు ప్రజలు కొబ్బరి నీళ్లు, పుచ్చకాయలు, ఐస్‌క్రీమ్‌లు, శీతలపానీయాలు సేవిస్తూ ఉపశమనం పొందుతున్నారు. ద్విచక్ర వాహనదారులు చెట్ల క్రింద వాహనాలను ఆపి వాతావరణం చల్లబడే వరకు చూస్తున్నారు. కొందరు గొడుగులు వేసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు.


శీతల పానీయాలు తాగుతున్న ప్రజలు

బలరాంనాయక్‌కు భారీ మెజారిటీ ఇవ్వాలి


వాజేడు : ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఏటూరునాగారం: ప్రచారం చేస్తున్న నేతలు

వాజేడు: మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పోరిక బలరాంనాయక్‌కు భారీ మెజారిటీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు కోరారు. మండల పరిధిలోని కొంగాల గ్రామంలో పాయబాట్ల, జగన్నాథపురం, కొంగాల, అరుణాచలపురం గ్రామాలకు చెందిన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటువేసేలా చూడాలని పిలుపునిచ్చారు. అనంతరం కొంగాలలో ప్రచారం నిర్వహించి పార్టీతో కలిగే ప్రయోజనాలతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు దాట్ల వీర వెంకటసీతారామరాజు, జగన్నాథరాజు, ఖాజావలి, షాబీర్ పాషా, తల్లడి ఆదినారాయణ; చిక్కుడు వెంకటేశ్వర్లు, మడకం భీమయ్య, మల్లె దుర్గారావు, రామ్మూర్తి, రాంబాబు, శ్రీను, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ఏటూరునాగారం : మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండలంలోని దొడ్ల, కొండాయి, మల్యాల గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయూబ్, ఖలీల్, ఎల్లయ్య, తదితరుల పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

భూపాలపల్లి అర్బన్: జంగేడు శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్‌లో 25 ఏళ్ల క్రితం నాటి మిత్రులందరు కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం వ్యక్తం చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

రోడ్లు వేశారు.. సైడ్ బర్మ్‌లు మరిచారు

- పొంచి ఉన్న ప్రమాదం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వాజేడు : లోక్‌సభ ఎన్నికల కోడ్ వస్తుందని త్వరత్వరగా మండలంలో సీసీ రోడ్లను వేశారు. దీంతో వారి పని పూర్తయిందని అనిపించుకున్నారు. కానీ రహదారికి ఇరువైపులా మొరంతో సైడ్‌బర్మ్‌లు వేయాలనే ఆలోచన మరిచిపోయారు. మండలంలో సుమారు 30 సీసీ రోడ్లను ఎన్నికల ముందు వేశారు. పనులు చేస్తుండటంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కష్టాలు తప్పి పోయాయని ప్రజలు భావించారు. కానీ రహదారికి ఇరువైపుల వేయాల్సిన సైడ్‌బర్మ్ పనులు వేయకుండా వదిలేశారు. ఆ పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా ప్రజలకు తెలియదు. అసలు ఆ పనులను చేస్తారా? వదిలేస్తారా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రహదారుల చివరన కూడా వాలు పెట్టకపోవడంతో ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలు పైకి ఎక్కడం, కిందకు దిగడం లేకుండా పోయింది. దీంతో రహదారికి దగ్గరే ఇళ్లు ఉన్నప్పటికీ చుట్టు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.


సైడ్ బర్మ్‌లు లేకపోవడం, రహదారి చివరన వదిలేయడంతో ప్రమాదకరంగా ఉన్న సీసీ రోడ్డు


సైడ్ బర్మ్‌లు వేయని సీసీ రోడ్డు

బీజేపీ అబద్ధాలకు మోసపోవద్దు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


టేకుమట్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: అబద్ధాలతో మీ ముందుకు వస్తున్న బీజేపీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గర్మిళ్లపల్లి, వెలిశాల, రామకిష్టాపూర్(వి), వెంకట్రావుపల్లి, రాఘవాపూర్, అంకుషాపూర్, రాఘవరెడ్డిపేట, కుందనపల్లి, వెల్లంపల్లి గ్రామాల్లో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఓటమి భయంతోని ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. మతతత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆరోపించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజారిటీతో కడియం కావ్యను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం వెలిశాల బీఆర్ఎస్ చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, నాయకులు నాంపెల్లి వీరేశం, తోట గట్టయ్య, సంపత్, కుమార్, కృష్ణారెడ్డి, సదానందం పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయాలి

కాటారం: రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడం కోసం మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పార్టీ మంథని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపిస్తే మంత్రి శ్రీధర్‌బాబు సారథ్యంలో ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు నవీన్‌రావు, ప్రభాకర్, వెంకటస్వామి, కదారి విక్రమ్, స్వప్న, రాజు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, మాజీ సర్పంచ్ జంపయ్య, యూత్ జనరల్ సెక్రటరీ మండల రాహుల్, ఎంపీటీసీ ప్రకాష్‌రావు,అశోక్, బాపన్న, శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాముత్తారం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేతిగుర్తుకు ఓటు వేసి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని పోలారం, ఉట్లపల్లి, పెగడపల్లి ,ప్రేమ్‌నగర్ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పక్కల సదువలి, రాష్ట్ర ఎలక్షన్ జాంయింట్ కన్వీనర్ ఇనుగొండ వెంకట్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్‌లీడర్ లింగమల్ల శారద, ప్రచార కమిటీ కన్వీనర్ ఓలపు శంకర్‌పటేల్, కోకన్వీనర్ నజీర్‌ఖాన్, ప్రచార కమిటీ కార్యదర్శి సకినాల రాజు, మండలపార్టీ ఉపాధ్యక్షుడు గడ్డంరాజబాపు, పోలారం ఎంపీటీసీ పుట్టపాక రాద, నాయకులు వెల్పుల సరిత, జాడిరాజయ్య, శంకర్, జనార్దన్, వెంటేష్ తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని టీపీసీసీ కార్యదర్శి, మంథని నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కాళేశ్వరంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. అనంతరం ఎస్టీ కాలనీ, మజీద్‌పల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, ప్రధానకార్యదర్శి మెంగాని అశోక్, డీసీసీ ప్రధానకార్యదర్శి కామిడి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మమత, మాజీ ఎంపీపీ సత్తమ్మ, రాష్ట్ర నాయకులు విలాస్‌రావు, అశోక్, జానీ, సారయ్య, సీతయ్య, సత్యనారాయణ, నభి, లక్ష్మణ్, పవన్, శకీల్, సమద్, అరుణ్, నాగేష్, తాజ్, అమీన్ పాల్గొన్నారు.


మల్హర్: మేనిఫెస్టోను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మహాముత్తారం: ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు


కాళేశ్వరం: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

చిట్యాల: ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ మండల కమిటీని రేగొండ మండలంలో కొడవటంచ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మేరుగు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా చింతల రమేష్‌ను ఎన్నికై నట్లు తెలిపారు. కాగా రమేష్ ఇప్పటికి 15వసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఉపాధ్యక్షుడిగా బండి రాజు, ప్రధాన కార్యదర్శిగా కట్కూరి రమేష్, సహాయ కార్యదర్శిగా బయగాని సందీప్, కోశాధికారిగా మాచర్ల సంజీవ్, ప్రచార కార్యదర్శిగా సరిగొమ్ముల రాజేందర్, స్పెషల్ టీం నాయకులుగా కట్కూరి రమేష్, టేకు రవి, కోల్లూరి అశోక్, బాబా రాజు, నరేందుల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయకులు పుల్ల రవితేజ, నరేందర్, సతీష్, కిరణ్, శివ, రాజు, నోముల రాజు, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీకి పలువురి రాజీనామా


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం బహుజన సమాజ్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో బీఎస్పీ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ అట్టెం రమేష్, నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేశ్, జిల్లా కోశాధికారి కందుగుల రాజన్న, కాటారం, మహాముత్తారం మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వల్ల బీఎస్పీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

పొక్లెయినర్, టిప్పర్ల సీజ్


అనుమతికి మించి మట్టిని తోడుతున్న పొక్లెయినర్

శాయంపేట : నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న పొక్లెయినర్‌తో పాటు 5 టిప్పర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని తహరాపూర్ పోచమ్మకుంట చెరువు మట్టిని పంట పొలాల్లో పోసుకునేందుకు అదే గ్రామానికి చెందిన గొట్టిముక్కుల విష్ణువర్ధన్‌రెడ్డి నీటిపారుదలశాఖ అధికారులతో అనుమతి తీసుకున్నాడు. అధికారులు పొక్లెయినర్, ట్రాక్టర్లతో మట్టి తరలింపునకు అనుమతి ఇవ్వగా నిబంధనలకు విరుద్ధంగా 200 మిషన్ (హిటాచి)తో అనుమతికి మించి టిప్పర్లతో మట్టి తరలించాడు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.గిరిధర్‌కు గ్రామస్తులు సమాచారం అందించారు. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డి టిప్పర్ డ్రైవర్లపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఈఈ గిరిధర్ తెలిపారు. డీఈఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మట్టి తరలిస్తున్న హిటాచి మిషన్, ఐదు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

శాయంపేట : పెద్దపూర్–వరంగల్ రూటు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని దళిత సంఘం నాయకుడు మారెపల్లి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వరంగల్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు ప్రజలకు ప్రయాణ ఖర్చులు అధికమవుతున్నాయని అన్నారు. వెంటనే పెద్దాపూర్–వరంగల్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

అక్రమంగా మట్టి తరలింపు!

భూపాలపల్లి రూరల్: మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం)లోని దొమ్మటిపల్లి చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. చెరువు నుంచి దళారులు మట్టిని చెరువు పరిధిలోని గ్రామాలకు కాకుండా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాలకు అక్రమంగా తరలించడంపై కొత్తపల్లి తదితర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం అధికారులు అందుబాటులో ఉండరని గ్రహించి మట్టిని తరలిస్తున్నారని వాపోయారు. మట్టిఅక్రమ తరలింపును అడ్డుకోవాలని అధికారులను కోరుతున్నారు.


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

ఎండవేడికి చేపల మృత్యువాత



కాటారం : ఎండవేడిమిని తట్టుకోలేక కాటారం మండలం రేగులగూడెం కొమ్ముసముద్రం చెరువులోని చేపలు ఆదివారం మృత్యువాతపడ్డాయి. కొన్ని రోజులుగా వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా పెరిగిపోవడంతో చెరువులోని నీరు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో చేపలకు సరిపడా నీరు లేకపోవడంతో ఎండ వేడి నేరుగా చేపలపై పడుతోంది. ఇదే క్రమంలో పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా అధిక సంఖ్యలో చేపలు మృతి చెంది నీటిపై తేలియాడాయి. సుమారు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు తూటి మనోహర్ తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.